# సాక్షి మహబూబాబాద్

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023




**అంగన్‌వాడీలకు మద్దతు**

అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం అన్నారు. - 8లో▸



**ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి**

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం $32.6^0/24.2^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మురికి కాల్వలను శుభ్రం చేసిన కార్మికులు



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో డ్రెయినేజీలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. మున్సిపాలిటీల్లో సమస్యలపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'దోమలు బాబోయ్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి స్పందించారు. వారి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది 36 వార్డుతో పాటు పలు వార్డుల్లో కాల్వలతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు.

### గణపతికి ప్రత్యేక పూజలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారులోని హైమ గార్డెన్ ఆవరణలో నెలకొల్పిన గణపతి సన్నిధిలో ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, కురవి జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో కేసముద్రం వైస్ ఎంపీపీ రావుల నవీన్ రెడ్డి, హైమ గార్డెన్ కమిటీ ప్రెసిడెంట్ వంకాయలపాటి లెనిన్ బాబు, జయప్రకాష్ లోయ, ముదిగొండ విశ్వనాథ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారులను గుర్తించాలి



గార్ల: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఉద్యమకారుడు జడ సత్యనారాయణ అన్నారు. ఆదివారం గార్లలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చదువులకు దూరమై కేసులపాలయ్యామన్నారు. ఇంకా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించి, నాడు సమైక్యవాదులుగా ఉన్న వారికి కీలకమైన పార్టీ పదవులు ఇచ్చారని మండిపడ్డారు. నేటి నుంచి నిర్వహించే నిరాహార దీక్షల్లో ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారులు భూక్య నాగేశ్వరరావు, కోమ్రాజు జగదీశ్, శ్రీనుగౌడ్, పిల్లల వీరస్వామి, కోల కుమార్‌గౌడ్, యాకుబ్‌పాషా, సాంబశివరావు, జానీమియా, ఇర్రి రవి పాల్గొన్నారు.

### నేడు తొర్రూరులో జాబ్‌మేళా

తొర్రూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా నేడు (సోమవారం) తొర్రూరులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ సన్యాసయ్య తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఈజీఎంఎం ఆధ్వర్యంలో మండల శివారు రామ ఉపేందర్ గార్డెన్‌లో జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. ఈ మేళాలో 80 ప్రైవేటు కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండి 10వ తరగతి మొదలు పీజీ వరకు అన్ని రకాల విద్యార్హతలు కలిగిన వారు మేళాలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, బయోడేటా, రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా లింగన్న

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై జిల్లా ఉద్యమకారుల వేదికను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కైరం కొండ రాము, ఉపాధ్యక్షులుగా అహ్మద్‌ఖాన్, భూక్య శోభన్‌బాబు, కార్యదర్శిగా సోమన్నను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు లింగన్న మాట్లాడుతూ..ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశా రు. త్యాగాల మీద రాష్ట్రం ఏర్పాటు అయితే రాజకీయ నాయకులు పదవులు అనుభవిస్తున్నారని అన్నారు.

# ఖాళీ స్థలం.. మురికి కూపం

- సమస్యలకు నిలయాలుగా ఓపెన్ ప్లాట్లు
- దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలు
- యజమానులకు నోటీస్‌లతోనే సరి
- మున్సిపాలిటీల్లో రూ.లక్షలు వెచ్చించినా తీరని దోమల సమస్య
- అనారోగ్యాలబారిన పడుతున్న ప్రజలు
- మొక్కుబడిగా ఫాగింగ్ పనులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మహబూబాబాద్: మున్సిపాలిటీల్లో ఖాళీ స్థలాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. దోమలు, ఈగలు, పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారాయి. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించినా.. సమస్యలు మాత్రం తీరడం లేదు. అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీస్‌లు ఇచ్చి చేతులు దుపులుకుంటున్నారు. ఫాగింగ్ పనులు మొక్కుబడిగా చేపడుతున్నారు. దీంతో దోమలు, ఈగలు, పందుల వల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల్లో ఆదివారం 'సాక్షి' చేపట్టిన గ్రౌండ్ రిపోర్ట్‌లో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**మానుకోట మున్సిపాలిటీలో..**

మానుకోట మున్సిపాలిటీలో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈగలు, దోమలు, పందులకు ఆవాసాలుగా మారడంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. కాగా పట్టణంలోని కంకరబోడ్ ప్రాంతంలో చాలా ఖాళీ స్థలాలు ఉండగా పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎంపీ క్యాంపు కార్యాలయం సమీపంలో ఖాళీ స్థలాల్లో చెట్లు ఏపుగా పెరిగి మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలబారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అలాగే ఎస్‌ఎస్‌వీఎల్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కృష్ణకాలనీతో పాటు పలు కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది. విలీన గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.



మానుకోటలోని ఎంపీ క్యాంపు ఆఫీస్ సమీపంలో ఖాళీ స్థలంలో చెట్లు, మురుగు నీటి నిల్వలు



కంకరబోడ్ ప్రాంతంలో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



కృష్ణ కాలనీలో..

**ఖాళీ స్థలాలు శుభ్రం చేయించాలి**



మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి. వాటితోనే పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుంది. దోమల సంఖ్య విపరీతంగా పెరిగి రాత్రి సమయంలో నిద్ర ఉండడం లేదు. ఈగలు, పందుల సంఖ్య కూడా పెరిగింది.

-సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకుడు,బ్యాంక్ కాలనీ రోడ్డు, మానుకోట

**ఫాగింగ్ చేయాలి**



వారానికి రెండుసార్లు అయినా వార్డుల్లో ఫాగింగ్ చేయాలి. కానీ నెలకు ఒక్కరోజు కూడా చేయడం లేదు. మొక్కుబడిగా చేస్తున్నారు. దీంతో దోమల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. కాల్వలను కూడా శుభ్రం చేయడం లేదు. దీంతో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

-గుడిబోయిన గోపి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మానుకోట

**దోమల వ్యాప్తి..**

మరిపెడ: నివాస గృహాల మధ్య ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మరిపెడ మున్సిపాలిటీలోని పూలబజారు, వడ్డెర కాలనీ, లోక్యతండాకు వెళ్లే వీధితో పాటు పలు చోట్ల నివాసగృహాల మధ్య ఖాళీ స్థలాల్లో ఈ పరిస్థితి నెలకొన్నది. మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు. ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాగా ఫాగింగ్ మిషన్లు నాలుగు ఉండగా.. ఫాగింగ్ కోసం ఏడాదికి రూ.లక్షకు పైనే ఖర్చు చేస్తున్నారు.



మరిపెడలో నివాసగృహాల మధ్య ఉన్న వ్యర్థాలు, పిచ్చిమొక్కలు

**దోమలతో రోగాలు..**



నివాస గృహాల చుట్టూ పిచ్చిమొక్కలు, వ్యర్థపదార్థాలు నిల్వ ఉండడంతో అందులో నుంచి దుర్గంధంతో పాటు దోమలు పెరిగి రోగాలపాలవుతున్నాం. మున్సిపాలిటీ సిబ్బంది వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఖాళీ స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలి.

-వంగవీటి భరత్, మరిపెడ

**అంతా మురుగు..**

తొర్రూరు: తొర్రూరు పట్టణంలోని పలు కాలనీల్లో ఖాళీ స్థలాలు (ఓపెన్ ప్లాట్లు) మురికి కూపాలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు నిలవడంతో పిచ్చి మొక్కలు మొలిశాయి. పరిసర ప్రాంత వాసులు అందులోనే చెత్త వేస్తుండడంతో దోమలు, పందులకు ఆవాసంగా మారుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో, కృష్ణ మందిరం సమీపంలో, కేవీఎన్ రోడ్డులో, బంజారానగర్, బీరప్పనగర్, కాకతీయ కాలనీ, సాయినగర్ తదితర కాలనీల్లో ఓపెన్ ప్లాట్లు దుర్గంధమయంగా మారాయి. నిర్వహణ లేని ఖాళీ స్థలాల యజమానులకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు అందిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత కారణంగా ఫాగింగ్ నిత్యం జరగడం లేదు. దోమల నివారణలో మలాథియన్ ద్రావణం కీలకం. దాని పేరు చెప్పి కిరోసిన్ పోసి పైపైన ఫాగింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫాగింగ్ మిషన్ల ట్యాంకు సామర్థ్యానికి తగ్గట్లు పెట్రోల్, డీజిల్‌లో మలాథియన్ మిశ్రమం కలిపి ఫాగింగ్ చేయాలి. ఇవేవి పాటించకుండా మొక్కుబడిగా చేపడుతున్నారు. దోమల నివారణకు మున్సిపాలిటీ నుంచి రూ.3.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు.



తొర్రూరులో ఓపెన్ ప్లాట్లలో నిలిచిన మురుగు

**వ్యాధుల నుంచి కాపాడాలి**



ఓపెన్‌ప్లాట్లలో చెత్తాచెదారం ఉండడంతో వ్యాధుల బారిన పడుతున్నాం. ఖాళీ స్థలాల్లోని పొదలను తొలగించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. చిన్న పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దోమల నివారణకు నిత్యం ఫాగింగ్ జరగడం లేదు. మున్సిపాలిటీ అధికారులు శ్రద్ధ వహించాలి.

-నర్కుటి సంతోష్, సాయినగర్, తొర్రూరు

**అపరిశుభ్రత..**

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీలోని పలు వీధుల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు అడ్డాగా మారాయి. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో చెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. అలాగే మురుగునీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగల బెడత, పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో 410 ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది పట్టణ ప్రగతి పనుల్లో భాగంగా సుమారు 250 మందికి ప్లాట్లు శుభ్రపర్చుకోవాలంటూ నోటీసులు జారీ చేశారు. ప్లాట్ల యజమానులు తమ ప్లాట్లను శుభ్రపర్చుకున్నా.. తిరిగి పిచ్చి మొక్కలు, చెట్లు పెరగడంతో చుట్టు పక్కల వారు చెత్తాచెదారం, వ్యర్థపదార్థాలు వేస్తుండడంతో దుర్గంధం వస్తుంది. మున్సిపాలిటీలో రెండు ఫాగింగ్ మిషన్లు ఉండగా ఒకటి పాడవడంతో మరో మిషన్ ద్వారా వీధుల్లో ఫాగింగ్ చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో వారానికి ఒకసారి మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు. ఫాగింగ్‌కు వినియోగించే మలాథిన్ ద్రవంతో పాటు డీజిల్, పెట్రోల్ కోసం వారానికి సుమారు రూ.15 వేలు ఖర్చు చేస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు.



సుభాష్‌వీధిలో ఖాళీ ప్లాట్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు

**ఫాగింగ్ సక్రమంగా చేయడం లేదు..**



మున్సిపాలిటీ సిబ్బంది వీధుల్లో ఫాగింగ్ సక్రమంగా చేయడం లేదు. ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు, పిచ్చి మొక్కలు పెరిగి దుర్గంధం, దోమలు, పాముల బెడద పెరిగింది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

-గాజుల వేణు, న్యూనెహ్రూ స్ట్రీట్, డోర్నకల్

**దోమల బెడద పెరిగింది..**



ఇళ్ల చుట్టూ ఖాళీ ప్లాట్లతో దోమల బెడద పెరిగింది. మా కాలనీలో రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి దుర్గంధంతో పాటు దోమల బెడద పెరిగింది.

-సాహిత్య, సుభాష్‌వీధి, డోర్నకల్

## బీఆర్‌ఎస్ పాలనలో పండుగలకు పెద్దపీట

- ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి: బీఆర్‌ఎస్ పాలనలో పండుగలకు పెద్దపీట వేస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదర్శయూత్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్నిమతాల పండుగలకు సీఎం కేసీఆర్ గిఫ్టులు పంపిణీ చేస్తున్నారని కొనియాడారు. కార్యాక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, సహకార సంఘం చైర్మన్ రాము, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, తొర్రూరు మార్కెట్ డైరెక్టర్ కిషోర్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

## 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన నిర్వహించతలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా వివిధ పార్టీలు, ప్రజా సంఘాలతో వీరభవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సేవలను గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా, కనీస వేతనాలు అమలు చేయకుండా మంత్రి సత్యవతిరాథోడ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ ప్రతినిధులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు గుజ్జు దేవేందర్, దార్ల శివరాజ్, రాము, అల్వాల వీరయ్య, నర్ర శ్రావణ్, ఎల్లారీశ్వరి, స్నేహబిందు, మామిండ్ల సాంబలక్ష్మి, దుడ్డెల రాంమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

## ప్రజలు బీజేపీని ఆదరించాలి

మహబూబాబాద్ రూరల్ : సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని, బీజేపీని ప్రజలు ఆదరించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ-ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమం మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడారు. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, 57 ఏళ్లకు పింఛన్ ఇస్తా అని చెప్పిన సీఎం కేసీఆర్ ఏ హామీ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. భర్తలు చనిపోయిన వారికి నాలుగు ఏళ్లుగా ఆసరా ఫించన్లు దిక్కులేవని విమర్శించారు. బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ మాట ఇస్తే తప్పరని, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు రాబోతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ నాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బానోత్ జహీందర్, గ్రామ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాటోతు హుస్సేన్‌నాయక్

# ఎన్నికలకు సర్వసన్నద్ధం

- షెడ్యూల్ ప్రకారమేనని ప్రచారం..
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- వీడియో కాన్ఫరెన్స్‌లలో సీఈఓ వికాస్‌రాజ్ సమీక్ష
- ఓటర్ల నమోదు, ప్రక్రియపై ఆరా..
- ఇప్పటికే కలెక్టరేట్లలో 'ఎలక్షన్ సెల్'ల ఏర్పాటు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు..
- శాంతిభద్రతల చర్యల్లో పోలీసుల నిమగ్నం

సాక్షి ప్రతినిధి, వరంగల్ : సార్వత్రిక ఎన్నికల నగారా ఎప్పుడు మోగినా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి వరంగల్ అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. సుమారు 27.89 లక్షల పైచిలుకు ఓటర్ల కోసం 3,252 పోలింగ్ కేంద్రాలు, 5,890 వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) సిద్ధం చేశారు. మూడేళ్లకుపైగా ఒకేచోట పని చేసిన అన్నిస్థాయిల అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కూడా దాదాపు పూర్తయింది. అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత బదిలీలు, పోస్టింగ్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిన నేపథ్యంలో అరకొరగా మిగిలిన బదిలీలు, పోస్టింగ్‌లు ఈ నెలాఖరు వరకు పూర్తి కానున్నాయి. ఓటర్ల నమోదు, ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ వారంలో రెండు పర్యాయాలు కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకుముందు ఆగస్టు 30న హైదరాబాద్‌లో కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో కీలక సమావేశం నిర్వహించారు. దీంతో ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, సీపీ/ఎస్పీలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టరేట్ కార్యాలయాల్లో ఎన్నికల సెల్‌లు ఏర్పాటు చేసి ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్(ఫైల్)

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు..**

ఉమ్మడి జిల్లా పరిధి 12 నియోజకవర్గాల్లో 27,89,336 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 13,85,231 పురుషులు, 14,03,860 స్త్రీలు, 245 ఇతరుల ఉన్నట్లు గతంలో అధికారులు ప్రకటించారు. 3,252 పోలింగ్ కేంద్రాలు, 5,890 వరకు ఈవీఎంలను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే సున్నిత, అతి సున్నిత గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు వివరాలను గోప్యంగా ఉంచారు. వీడియో రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్, లైవ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షించేందుకు ఎన్ఐటీ, ఇతర యూనివర్సిటీ విద్యార్థులను వినియోగించుకునే అవకాశాలపైనా సమీక్షించినట్లు సమాచారం. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో అక్రమ మద్యం, డబ్బు రావడానికి వీలు లేకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు పాయింట్లను గుర్తించారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారితో పాటు ఏఆర్‌ఓల నియామకం జరిగింది. ఇతర ఎన్నికల సిబ్బందిని సైతం ఎంపిక చేసి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

| | |
|---|---|
| ఉమ్మడి జిల్లాలో ఓటర్లు | : 27,89,336 |
| పురుషులు | : 13,85,231 |
| స్త్రీలు | : 14,03,860 |
| ఇతరులు | : 245 |
| పోలింగ్ కేంద్రాలు | : 3,252 |

**గత ఎన్నికల నివేదికల పరిశీలన..**

సాధారణంగా ఎన్నికల్లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉండగా.. 2018 సార్వత్రిక ఎన్నికల పరిణామాలపైనా కలెక్టర్, ఎస్పీలు పరిశీలించినట్లు తెలిసింది. ఘర్షణలు, నమోదైన కేసులపై ఆరా తీశారు. ఎన్నికల నేపథ్యంలో అదనపు పోలీసు బలగాలు రానుండగా.. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో మోహరించే విషయమై కసరత్తు చేసి జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. మండల, జిల్లా పరిషత్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మకంగా మారిన గ్రామాలపై సమీక్ష నిర్వహించి వచ్చే ఎన్నికల పోలింగ్ కోసం నిఘా పెంచే ప్రయత్నంలో ఉన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలపై ఇండియన్ పీనల్ కోడ్ కింద 57కు పైగా కేసులు నమోదు కాగా, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు. వివిధ కారణాలతో ఆయుధ లైసెన్స్‌లు పొందిన పలువురి జాబితాను తయారు చేసిన అధికారులు.. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే వారి ఆయుధాలు స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు సిద్ధం చేశారు. ఇప్పటికే రౌడీషీటర్ల జాబితాను రెడీ చేసిన పోలీసులు ఠాణాల వారీగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించి వెళ్లిన వెంటనే నోటిఫికేషన్ వెలువడవచ్చన్న సమాచారం మేరకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది.

## మిరప మొక్కలకు 'జెమిని' వైరస్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం సింగారం, ఇస్లావత్‌తండా జీపీల పరిధిలో మిరప మొక్కలకు జెమిని వైరస్, బొబ్బ రోగం వచ్చి మిరప చేలు దెబ్బతిన్నాయని రైతులు ఇస్లావత్ శ్రీనివాస్, బానోత్ భాస్కర్‌నాయక్, ఇస్లావత్ లక్‌పతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 10వ తేదీన మిర్చి తోటలు నాటామని, సెప్టెంబర్ నెల మొత్తం ఎండలు అధికంగా ఉండడంతో మొక్కలు చచ్చిపోయి ఆర్థికంగా నష్టపోయామని రైతులు అన్నారు. ఆ తర్వాత నర్సరీ ద్వారా రెండుసార్లు మిరప నారు తెచ్చుకొని నాటినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం తోటలను తీసివేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



జెమిని వైరస్, బొబ్బరోగం సోకగా తొలగించిన మిరప మొక్కలను చూపుతున్న రైతులు

## కొండచిలువ కలకలం..



చంపిన అనంతరం కొండచిలువను తీసుకెళ్తున్న రైతులు

నెల్లికుదురు: మహబూబాబాద్‌ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో ఆదివారం భారీ కొండచిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన గుండ వెంకటేష్‌ పొలంలో కూలీలు కలుపు తీస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు వస్తుండగా పొలం పక్కనున్న పత్తి చేనులో భారీ కొండచిలువ కనిపించింది. దీంతో వారు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. వెంటనే సమీప రైతులు కొండచిలువను చంపారు. సుమారు 3 మీటర్ల పొడవు 30కిలోల బరువున్న కొండచిలువను చంపడంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

## ఫార్మసిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలి

- అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్‌



సుదర్శన్‌ గౌడ్‌

ఎంజీఎం : ఫార్మసిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలని గవర్నమెంట్‌ ఫార్మసిస్ట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వానికి మెయిల్‌ ద్వారా ఫార్మసిస్ట్‌ల సమస్యలు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఫార్మసిస్ట్‌లను ఫార్మసీ అధికారులుగా గుర్తించారని, సెప్టెంబర్‌ 19వ తేదీన ఎయిమ్స్‌ కూడా ఫార్మసిస్ట్‌లను ఫార్మసీ ఆఫీసర్‌గా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

- ఫార్మసీ చట్టం ప్రకారం ప్రతి జిల్లా వైద్యారోగ్యశాఖ స్టోర్‌లో ఒక ఫార్మసీ సూపర్‌వైజర్‌, గ్రేడ్‌- ఫార్మసిస్ట్‌, ఇద్దరు గ్రేడ్‌-2 ఫార్మసీ పోస్టులు ఇవ్వాలన్నారు.
- 24 గంటలు విధులు నిర్వర్తించే పీహెచ్‌సీలో గ్రేడ్‌-1, గ్రేడ్‌-2 ఫార్మసిస్ట్‌ల పోస్టులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.
- రాష్ట్రంలోని అన్ని పల్లె, బస్తీ దవాఖానాల్లో ఫార్మసిస్ట్‌ పోస్టులు మంజూరు చేయాలని, ఇన్‌సర్వీస్‌ ఫార్మసిస్ట్‌లకు డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ డ్రగ్‌ అనలిస్టు, డైటీషియన్‌ పోస్టుల్లో 30 శాతం కోటా కేటాయించాలన్నారు.
- రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం, ఆర్‌బీఎస్‌కె, 104, ఏఆర్‌టీ, డీఎంఎఫ్‌టీ పథకాలతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వర్తిస్తున్న ఫార్మసిస్ట్‌లందరికీ వైద్యులతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు.
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ ఫార్మసిస్ట్‌లందరినీ రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌చేశారు.





# ప్రతిభకు పదును..

### విద్యార్థులకు వీరగాథ-3 పోటీలు

- సృజనాత్మకతను వెలికి తీసి దేశభక్తిని పెంపొందించే ఆలోచన
- పోటీలకు 3 నుంచి 12వ తరగతి విద్యార్థులు అర్హులు
- ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌ ద్వారా నమోదు

కాళోజీ సెంటర్‌ : దేశం కోసం త్యాగం చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకోవడంతోపాటు దేశభక్తి, లౌకికవాదం, భిన్నత్వంలో ఏకత్వం వంటి సందేశాత్మక ఆలోచనలను విద్యార్థుల్లో కల్పించేందుకు భారత విద్యా, రక్షణ మంత్రుత్వ శాఖలు సంయుక్తంగా వీరగాథ-3 పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ ప్రతిభా పాటవ పోటీల్లో సృజనాత్మకతను చాటుతున్న విద్యార్థులకు ఈ పోటీలు వేదిక కానున్నాయి. ఇందులో 3 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. కథలు, చిత్రలేఖనం, పద్యాలు, వ్యాసరచన, మల్టీ మీడియా ప్రదర్శన, తదితర అంశాలపై అవగాహన ఉన్న విద్యార్థులు పోటీలో పాల్గొనడానికి ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌ ద్వారా పేరు నమోదు చేసుకోవాలి.

**పాల్గొనే అంశాలు ఇవే..**

వీరగాథ-3 పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు నచ్చిన అంశాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

- దేశం కోసం అత్యున్నత త్యాగం చేసి గ్యాలంటరీ అవార్డు పొందిన విజేత జీవితం నుంచి నేర్చుకున్న విలువల గురించి ప్రస్తావించాలి. త్యాగం సజీవంగా ఉండడానికి అవకాశం ఇస్తే ఏం చేయదలచుకున్నారో వివరించాలి.
- స్వాతంత్య్ర పోరాటంలో గిరిజనుల పాత్ర, ఇతర అంశాలను ఎంచుకుని వివరించాలి.





వీరగాథ-3 లోగో

- ఝాన్సీ లక్ష్మీబాయి.. విద్యార్థి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేయాలనుకుంటున్నారో వివరించాలి.
- 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్య్ర సమర యోధుడి జీవిత కథ ఎలా ప్రభావితం చేసిందో వివరించాలి.

**పోటీలు నాలుగు విభాగాల్లో..**

- 3-5 తరగతుల విద్యార్థులకు పద్య, పేరా గ్రాఫ్‌ 150 పదాలు, పెయిటింగ్‌, డ్రాయింగ్‌ పోటీలు.
- 6-8 తరగతి విద్యార్థులకు పద్యాలు, పేరా గ్రాఫ్‌ 300 పదాలు, పెయిటింగ్‌, డ్రాయింగ్‌, మల్టీ మీడియా ప్రదర్శన.
- 9-10 తరగతి విద్యార్థులకు పద్యాలు, వ్యాసం 700 పదాలు,పెయిటింగ్‌,డ్రాయింగ్‌,మల్టీ మీడియా ప్రదర్శన.
- 11-12 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం 1000 పదాలు మించకుండా, పెయింటింగ్‌, డ్రాయింగ్‌,మల్టీ మీడియా ప్రదర్శన

**నమోదు ఇలా..**

పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ఉపాధ్యాయులు వారి విద్యార్థులు పాల్గొనడానికి ఆన్‌లైన్‌ పేరు నమోదు చేయాలి.నమోదు కోసం httpr//innov-ateind-ia.mygov.in/v-eer3 వెబ్‌ సైట్‌ను ఓపెన్‌ చేయాలి. అందులో సమ్మిట్‌ యూవర్‌ ఎంట్రీని క్లిక్‌ చేయాలి.మొబైల్‌ నంబర్‌ టైప్‌ చేస్తే వచ్చిన ఓటీపీ ద్వారా లాగిన్‌ కావాలి. ఈ వివరాలు ప్రధానోపాధ్యాయుల నమోదు చేయాలి. విద్యార్థి కేటగిరీ ఎంచుకుని అంశం పద్యాలు, పెయిటింగ్‌, డ్రాయింగ్‌, మల్టీ మీడియా ప్రదర్శనను ఎంపిక చేసుకోవాలి. విద్యార్థి వివరాలు, తన అంశం వివరణ తెలిపే పేపర్‌ను అప్‌లోడ్‌ చేసి తర్వాత సబ్మిట్‌ బటన్‌ క్లిక్‌ చేయాలి. ఇదంత పూర్తి చేసిన తర్వాత సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి అత్యుత్తమ నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్‌ చేయాలి. ఈ ఉత్తమ నాలుగును సంబంధిత ఎంఈఓకు అందజేయాలి. తదుపరి ఎంఈఓ 20 ఉత్తమ ఎంట్రీలను జిల్లా నోడల్‌ అధికారికి సమర్పించాలి.ఆన్‌లైన్‌ అప్లికేషన్‌ నంబర్‌, హార్డ్‌ కాపీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా సైన్స్‌ అధికారికి అందజేయాలి.

### వీరగాథ-3 పోటీలో పాల్గొనాలి



సృజనాత్మకతను వెలికి తీసి దేశభక్తి నింపే వీరగాథ-3 పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి. అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలి.

-డి.వాసంతి, డీఈఓ, వరంగల్‌

### 30వ తేదీ వరకు నమోదు చేసుకోవాలి



జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు ఈ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థుల పేర్లను ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఎంట్రీలను జిల్లా కేంద్రానికి పంపాలి.వివరాలకు 9848878455 ఫోన్‌ చేయాలి.

-డాక్టర్‌ కట్ల శ్రీనివాస్‌, జిల్లా సైన్స్‌ అధికారి

## అతివేగం.. ఆపై నిద్ర..

- ఫోర్ట్‌రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్న డీసీఎం
- డ్రైవర్‌, క్లీనర్‌కు స్వల్ప గాయాలు



ఖిలా వరంగల్‌ : ఫోర్ట్‌ రోడ్డులో ఇసుక అడ్డా జంక్షన్‌ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున కొబ్బరి బొండాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం.. డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌, క్లీనర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డారు అయితే ఈ ఘటనకు అతివేగం.. ఆపై డ్రైవర్‌ కునుకు తీయడమే ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. డీసీఎం.. డివైడర్‌ను ఢీకొన్న సమయంలో భారీ శబ్దం రావడంతో వాహనదారులు, స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అనంతరం డీసీఎం క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్‌, క్లీనర్లను క్షేమంగా బయటకు తీశారు. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఓ డీసీఎం యజమాని ఆంధ్రప్రదేశ్‌ నుంచి వరంగల్‌కు కొబ్బరి బొండాలు తెప్పిస్తున్నారు. రోజువారీగానే శనివారం సాయంత్రం డీసీఎం.. కొబ్బరిబొండాల లోడ్‌తో బయలుదేరింది. ఉదయం 4 గంటల లోపు వ్యాపారులకు అందించాలనే లక్ష్యంతో నిద్ర ఉపక్రమించకుండా అతివేగం వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌ సమీపంలో డీసీఎం.. డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌, క్లీనర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదం జరగడానికి ప్రధాన కారణం అతివేగమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## లైంగిక వేధింపులపై ఫిర్యాదు

నర్సింహులపేట: తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని వంతడపలకు చెందిన ఓ మహిళ ఆదివారం పీఎస్‌లో చేశారు. ఇదే గ్రామానికి చెందిన కమటం వెంకన్న తనను లైంగికంగా వేధించడంతోపాటు కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత శుక్రవారం ఇంట్లోకి వచ్చి లైంగికవేధింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో తాను కేకలు వేయడంతో పారిపోయాడని పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కాగా, ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బాధితురాలు ఫిర్యాదు చేసిందని, విచారణ జరిపిన అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## రాజ్యాధికారం సాధించుకుందాం

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్‌ మహారాజ్‌



మాట్లాడుతున్న విశారదన్‌ మహారాజ్‌

నెహ్రూసెంటర్‌: బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ధర్మ సమాజ్‌ పార్టీతో కలిసి రాజ్యాధికారం సాధించుకోవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్‌ మహారాజ్‌ అన్నారు. పార్టీ మహబూబాబాద్‌ జిల్లా ఆవిర్భావ దినోత్సవ సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్టీ ఎస్సీ వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాలన్నారు. ఏడు శాతం కూడా లేని అగ్రవర్ణాలు 93 శాతం ఉన్న ప్రజలను పరిపాలిస్తున్నారన్నారు. ఎస్టీ ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల్లో ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలుపొంది భూస్వాముల వద్దకే వెళ్తున్నారన్నారు. ప్రజలను మోసం చేస్తున్న దళారులను ఓడించి ధర్మ సమాజ్‌ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో కొమ్ము రామకృష్ణ, సపావత్‌ కిషన్‌, సాయిబాబు, దాసరి శ్రీనివాస్‌, కృష్ణ, వట్టం ఉపేందర్‌, సురుగు కృష్ణ, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

## పదమూడేళ్లుగా 'మట్టి గణపతి'కి పూజలు



లక్ష్మీసాయి అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన మట్టి విగ్రహం

హన్మకొండ: హనుమకొండ హౌజింగ్‌ బోర్డు కాలనీలోని లక్ష్మీ సాయి అపార్ట్‌మెంట్‌ వెల్ఫేర్‌ సొసైటీ పదమూడేళ్లుగా మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈఅపార్ట్‌మెంట్‌లో 2010 నుంచి ఏటా మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు జరుపుతున్నారు. ప్లాస్టర్‌ ఆఫ్‌ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతోందని, మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుతున్నామని అపార్ట్‌మెంట్‌ వాసులు చెబుతున్నారు. ఇతర ఉత్సవ కమిటీలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

### ఏటా అవార్డు వచ్చేది..



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మేం ఏటా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి ఉత్సవాలు జరుపుతున్నాం. ఏటా విశ్వహిందు పరిషత్‌ అందించే ఉత్తమ అవార్డు 2010 నుంచి వరుసగా 5 సంవత్సరాలు మాకే వచ్చింది.

- పోలేపల్లి రాజిరెడ్డి, అపార్ట్‌మెంట్‌ కమిటీ అధ్యక్షుడు

## చికిత్స పొందుతున్న రైతు మృతి



సంజీవ్‌ (ఫైల్‌)

కాటారం: అప్పుల బాధతో ఈ నెల 21వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని గంటగూడెంలో జరిగింది. ఎస్సై అభినవ్‌ కథనం ప్రకారం కాటారానికి చెందిన గంట సంజీవ్‌(33) తనకున్న రెండున్నర ఎకరాల భూమితో పాటు మరో మూడున్నర ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వరి, పత్తి పంటలు సాగు చేశాడు. అయితే ప్రకృతి విపత్తులతో రెండేళ్లుగా పంట దిగుబడి సరిగా లేదు. పంట పెట్టుబడి, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల మేర అప్పు అయింది. పంట ద్వారా అప్పు తీర్చే అవకాశం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్‌ తెలిపారు.

**మడికొండలో వ్యక్తి..**

మడికొండ: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మడికొండ రొట్టెబండ్ల ప్రాంతానికి చెందిన ఎత్తరి పెద్ద మల్లయ్య(55) ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు.

## తిర్మలాయపల్లిలో ఒకరి ఆత్మహత్య



మల్లేశం (ఫైల్‌)

రాయపర్తి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తిర్మలాయపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన చిక్కుడు మల్లేశం(40) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బులు కావాలని ఆదివారం ఉదయం తన భార్యతో గొడవపడ్డాడు. ఆమె లేవని చెప్పడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ అదేరోజు సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి వెంకటనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్‌ తెలిపారు. మృతుడికి భార్య శోభ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



దేవరుప్పులలో అన్నదానం ప్రారంభించి మహిళలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

- పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం చిన్నమడూరు, దేవరుప్పుల, తదితర గ్రామాల్లో గణేష్‌ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణలోనే పాలకుర్తి నియోజకవర్గం.. విశిష్టత కలిగిన దేవుళ్లు, కవులకు నిలయమన్నారు. సీఎం కేసీఆర్‌ సహకారంతో పాలకుర్తి సోమనాథుడు, బమ్మెర పోతన, వల్మీడి సీతారామచంద్రస్వామి ఆలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందనే ఉద్దేశంతో ఊరూరా వ్యక్తిగతంగా గణేష్‌ విగ్రహాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను ప్రశాంతగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విగ్రహాదాత మంత్రి ఎర్రబెల్లిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం దేవరుప్పులలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే, ఆదివారం రాత్రి మండలంలోని రంబోజీగూడెం,కోలుకొండ గ్రామాల్లో గణేష్‌ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్‌, చింత రవి, మండల నాయకులు చామల విక్రమ్‌రెడ్డి, వంగ అర్జున్‌, బొందుగుల సోమయ్య, మల్లేష్‌, మధు, జగన్‌, వెంకటయ్య , యాదగిరి, తోటకూరి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

- టీజేఎస్‌ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ కోదండరాం

కురవి: అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె న్యాయమైందని, సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ జన సమితి(టీజేఎస్‌) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తహసీల్దార్‌ కార్యాలయ సమీపంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని కోదండరాం సందర్శించి, సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీ ఉద్యోగులతో చర్చలు జరపాలని, న్యాయ డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని అన్నారు. ఇప్పటి వరకు వారికి వచ్చిన వేతనాలన్నీ కొట్లాడి తెచ్చుకున్నవేనని, ఎవరూ దయతలచి ఇచ్చినవి కాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్లప్పటికీ పనులు ఉంటాయని, అవి మూతపడేవి కావన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకాభిప్రాయంతో సమస్యలు పరిష్కరించాలన్నారు. సీనియారిటీని గుర్తించి, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీల డిమాండ్‌లను ప్రభుత్వం ఒప్పుకోలేదని, సమ్మె విరమించాలని చెబుతూ, సమ్మె చేస్తున్న వారితో కాకుండా వేరేవారితో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా సమ్మె చేస్తున్న ఉద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్లను సాధించే వరకూ పోరాడాలని, తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్‌ పోతుగంటి మల్లయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు గుగులోతు సరోజ, మంగమ్మ, తార, నాగేంద్ర, నిర్మల, మహాలక్ష్మీ, కవిత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## 'తూర్పు'లో మాజీ కార్పొరేటర్ల మంత్రాంగం

- ఉద్యమకారులు, సీనియర్లకు అవమానాలు
- అభ్యర్థిని మార్చాలని తీర్మానం
- అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయం

వరంగల్‌: వరంగల్‌ తూర్పు బీఆర్‌ఎస్‌ పార్టీలో ముసలం పుట్టింది. కొద్ది రోజులుగా అధికార పార్టీ కార్పొరేటర్లు తూర్పు అభ్యర్థిని మార్చాలని సమావేశాలు నిర్వహించగా.. ఇప్పుడు మాజీలు సైతం అదే దారిలో గళమెత్తుతున్నారు. ఆదివారం పోచమ్మమైదాన్‌లోని ఒక హోటల్‌లో మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, పార్టీ సీనియర్లు కొంత మంది భేటీ అయ్యారు. ఆదివారం అండర్‌ రైల్వేగేట్‌ ప్రాంతానికి చెందిన ఒక మాజీ కార్పొరేటర్‌ భర్త నేతృత్వంలో జరిగిన ఈసమావేశంలో సుమారు 30 మంది వరకు పాల్గొని బీఆర్‌ఎస్‌ తూర్పు అభ్యర్థిని మార్చాలని తీర్మానం చేసి పార్టీ అధిష్టానికి తమ డిమాండ్‌ను వినిపించనున్నట్లు తెలిసింది.

**కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమావేశం..**

కాగా.. మూడ్రోజుల క్రితం అధికార పార్టీ కార్పొరేటర్లు రాంకీలో సమావేశమై తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌ను మార్చాలని నిర్ణయం తీసుకున్న విషయం మీడియాలో వచ్చింది. ఈవిషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నరేందర్‌ కొంత మంది కార్పొరేటర్లతో శుక్రవారం సమావేశమైనట్లు తెలిసింది. ఈసమావేశానికి ఆరుగురు కార్పొరేటర్లు గైర్హాజరైనట్లు సమాచారం. ఈసమావేశంలో కార్పొరేటర్లకు తగిన ప్రాధాన్యం ఇస్తానని, డివిజన్లలో చేపట్టే పనులు, కార్యక్రమాలు పూర్తిగా వారి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాగా.. మాజీ కార్పొరేటర్ల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. కొంత మంది ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్న వారు తాము ఆయనకు మద్దతుగా ఉంటున్నామని మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారన్న చర్చ జరిగినట్లు తెలిసింది. కొంతమంది అధికార కార్పొరేటర్లకు లక్షల్లో డబ్బు ఆశజూపినందునే వారు మద్దతు ప్రకటించారని మాజీలు ఆరోపిస్తున్నారు.

**పూర్తి స్థాయిలో పరిశీలించాలి: మాజీలు**

తెలంగాణ పోరాటంలో భాగస్వామ్యమైన ఉద్యమకారులు చాలా మందికి గుర్తింపు లేదని, కొంత మందిపై తూర్పు ఎమ్మెల్యే అణచివేతకు, అవమానాలకు పాల్పడుతున్నట్లు వాపోయినట్లు తెలిసింది. కార్పొరేటర్లతో పాటు అధికార పార్టీ నాయకుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నందున అధిష్టానం పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి టికెట్‌ విషయంలో నిర్ణయం తీసుకోవాలని మాజీ కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌ అధిష్టానానికి విన్నవించేందుకు త్వరలో రాజధానికి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే నరేందర్‌కు టికెట్‌ ఇవ్వకుండా అభ్యర్థిని మార్చాలన్న డిమాండ్‌తో భవిష్యత్‌ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిసింది. త్వరలో రెండో సమావేశం నిర్వహిస్తారని సమాచారం.

## శిల్ప కళా సంపద మహాద్భుతం





హెరిటేజ్‌ వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ ప్రావీణ్య, కమిషనర్‌ బాషా

- వరంగల్‌ కలెక్టర్‌ ప్రావీణ్య
- పర్యాటకశాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్‌ వాక్‌

ఖిలా వరంగల్‌: కాకతీయుల నిర్మాణాలు, రాతిలో మలిచిన శిల్ప కళా సంపద మహాద్భుతంగా ఉన్నాయని, పర్యాటక రంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులకు చరిత్రపై అవగాహన కల్పించాల్సిన అవసరం మనందరి మీద ఉందని కలెక్టర్‌ ప్రావీణ్య సూచించారు. సెప్టెంబర్‌ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఖిలా వరంగల్‌ వాకింగ్‌ గ్రౌండ్‌లో పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ ఆధ్వర్యంలో హెరిటేజ్‌ వాక్‌ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్‌ ప్రావీణ్య, నగర కమిషనర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా హాజరై.. స్థానిక కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణతో కలిసి వారు జెండా ఊపి హెరిటేజ్‌ వాక్‌ను ప్రారంభించారు. అనంతరం పూర్వీకులు అందించిన శిల్ప కళా సంపదను భావితరాలకు అందించేలా కాపాడాలని నినాదాలు చేస్తూ హెరిటేజ్‌ వాక్‌ నిర్వహించారు. వాకింగ్‌ గ్రౌండ్‌ నుంచి ఖుష్‌మహల్‌ మీదుగా శిల్పాల ప్రాంగణం వరకు వాక్‌ సాగింది. ఈసందర్భంగా కలెక్టర్‌ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్‌ రిజ్వానా బాషా మాట్లాడుతూ.. కాకతీయుల పాలనతీరు, నిర్మాణాలు, వారు చేపట్టిన సంక్షేమాలు నేటి తరం సమాజానికి ఆదర్శమన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ.. ఈనెల 27న నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా భద్రకాళీ బండ్‌ వద్ద బోటింగ్‌ యూనిట్‌ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు రవీందర్‌, తహసీల్దార్‌ నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, డాక్టర్‌ మైదం రాజు, బైరబోయిన దామోదర్‌, సాగర్ల శ్రీనివాస్‌, గైడ్‌ దేనబోయిన రవియాదవ్‌, కుసుమ సూర్యకిరణ్‌, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్‌ కేంద్ర పురావస్తుశాఖ అధికారి మడిపెల్లి మల్లేశం, లోకేశ్‌, ఖాదర్‌పాషా, అజయ్‌, బొల్లంకొండ రమేశ్‌, రాజేశ్‌ పాల్గొన్నారు.